క్లుప్తంగా

ఆ రుణాలూ మాఫీచేయాలి

జూలూరుపాడు: చేతిరాత (మాన్యువల్) పహాణీపై రుణాలు తీసుకున్న రైతులకు కూడా మాఫీ వర్తింపజేయాలని జూలూరుపాడు సొసైటీ చైర్మన్ చీమలపాటి భిక్షం కోరారు. స్థానిక పీఏసీఎస్‌లో డైరెక్టర్లతో కలిసి సోమవారం ఆయన మాట్లాడారు. పట్టాదారు పాస్‌పుస్తకాలు లేని 862 మంది రైతులు మాన్యువల్ పహాణీ ద్వారా పొందిన రుణాలు మాఫీ చేయాలని కోరారు. డైరెక్టర్లు యల్లంకి సత్యనారాయణ, లకావత్ హేమ్లా, పాపిన్ని వెంకయ్య, చాపలమడుగు రామ్మూర్తి, భూక్యా జవహర్‌లాల్, కల్యాణపు నరేశ్ పాల్గొన్నారు.

డీవైఎస్‌ఓ కార్యాలయ ఉద్యోగి బదిలీ

కొత్తగూడెంటౌన్: జిల్లా యువజన, క్రీడల శాఖ కార్యాలయం అసిస్టెంట్ మేనేజర్ ఆర్.ఉదయ్ కుమార్ బదిలీ అయ్యారు. ఆయన్ను ఖమ్మం కార్యాలయానికి బదిలీ చేస్తూ సోమవారం ఉత్తర్వులు విడుదల కాగా, ఆ స్థానంలో ఇంకా ఎవరినీ కేటాయించలేదు. కాగా, బదిలీపై వెళ్తున్న ఉదయ్‌కుమార్‌ను పలువురు సన్మానించారు. డీవైఎస్‌ఓ కె.సంజీవరావు," ఉద్యోగులు తిరుమల్‌రావు, లక్ష్మణ్, క్రీడాసంఘాల బాధ్యులు కె.మహీధర్, కాశీహుస్సేన్, మట్టపర్తి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ శిబిరం

జూలూరుపాడు: స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత ఫిజియోథెరపీ శిబిరాన్ని నిర్వహించారు. దివ్యాంగులకు ఫిజియోథెరపిస్ట్ జ్యోతి ఆధ్వర్యంలో ఫిట్‌నెస్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి సోమవారం దివ్యాంగుల కోసం ఉచితంగా ఫిజియోథెరపీ క్యాంప్ నిర్వహిస్తామన్నారు. లక్ష్మీనర్సయ్య, నేతాజీ, రేగళ్ల సాంబశివరావు, జక్కుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో తెలంగాణ ఆశ వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంవీ అప్పారావు మాట్లాడుతూ.. ఆశా వర్కర్లకు నెలకు రూ.26 వేలు వేతనం ఇవ్వాలన్నారు. పారితోషికాలు అందరికీ సమానంగా రావడం లేదని, నిర్దిష్ట వేతనం నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దొడ్డ రవికుమార్, కె.సత్య, గుర్రం రాములు, ఝాన్సీ, జయ, రుక్మిణి, సుశీల, సునీత, రమణ, ఉష, చీమల రమణ, నీలిమ, యశోద, సున్నం పద్మ, శారద, విజయ పాల్గొన్నారు.

ఉపాధి కూలీల ఆందోళన

జూలూరుపాడు: పెండింగ్ ఉపాధి బిల్లులు తక్షణమే చెల్లించాలని కోరుతూ సోమవారం స్థానిక ఉపాధి కార్యాలయం ఎదుట జూలూరుపాడు గ్రామ పంచాయతీకి చెందిన కూలీలు ధర్నా నిర్వహించారు. 25 మందికి ఏప్రిల్ చివర వారం, మే నెలకు సంబంధించిన డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమ చేయలేదని, ఎండలో పనిచేస్తే రెండు నెలలు గడుస్తున్నా డబ్బులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి కూలీలకు సీపీఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు మద్దతు తెలిపారు.

నిర్లక్ష్యం చేయొద్దు

ఇల్లెందురూరల్: జ్వరాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీపంలోని వైద్యసిబ్బందిని సంప్రదించాలని కొమరారం పీహెచ్‌సీ వైద్యాధికారిణి లోహిత సూచించారు. మండలంలోని మర్రిగూడెం, బాలాజీతండా, పెద్దగుంపు గ్రామాల్లో సోమవారం వైద్యశిబిరాలు నిర్వహించారు. ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. గ్రామంలో ప్రతి వీధిని నందర్శించి నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్‌బాల్స్ వేశారు.

మామిడిగూడెంలో వైద్యశిబిరం

సాక్షి ఎఫెక్ట్..

పాల్వంచరూరల్: మండలంలోని మామిడిగూడెం, రేగులగూడెం, తుమ్మలగూడెం గ్రామాల ప్రజలు విషజ్వరాల బారిన పడుతుండగా 'సాక్షి'లో సోమవారం 'విషజ్వరాలతో ఏజెన్సీ విలవిల' శీర్షికన కథనం ప్రచురితం కావడంతో వైద్యాధికారులు స్పందించారు. ఉల్వనూరు పీహెచ్‌సీ డాక్టర్ తేజశ్రీ, సిబ్బందితో కలిసి మామిడిగూడెంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. స్థానికులను పరీక్షించి అవసరమైన వారిని ఆస్పత్రులకు తరలించారు.

అప్రమత్తత అవసరం

పాల్వంచరూరల్: భారీ వర్షాలు కురుస్తున్నందున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని రాజాపురం వద్ద నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిని, కిన్నెరసాని జలాశయాన్ని సోమవారం ఆయన సందర్శించి, మాట్లాడారు. బలహీనంగా ఉన్న చెరువులు, వాగులు, వంతెనలు, కుంటలు తెగే ప్రమాదం ఉందని, ఆ ప్రాంతాలకు వెళ్లే క్రమంలో జాగ్రత్తలు పాటించాలని కోరారు.

ఆర్య వైశ్య నేతకు సత్కారం

ఇల్లెందు: ఆర్య వైశ్య మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి యెలుగూరి నగేశ్‌కుమార్‌ను మండల, పట్టణ కమిటీల ఆధ్వర్యంలో ఇల్లెందు కన్యకాపరమేశ్వరి సత్రంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ప్రొద్దుటూరి నాగేశ్వరరావు, అర్వపల్లి రాధాకృష్ణ, అనుబాబు, రమేశ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సుందరంగా ముస్తాబు..

ముమ్మరంగా సాగుతున్న సుందరీకరణ పనులు

- ఇల్లెందు చెరువు కట్టపై పిచ్చిచెట్ల తొలగింపు
- నీటితో నిండితే కొత్త అందం
- ట్యాంక్ బండ్, లేక్ వ్యూ పార్క్‌లో మొదలుకానున్న సందడి


పిచ్చిచెట్లు తొలగించడంతో శుభ్రంగా కనిపిస్తున్న చెరువు కట్ట

ఇల్లెందు: ఏటా వర్షాకాలం మాదిరిగానే ఇల్లెందులోని మంచినీటి (చెరువు) జలాశయం ముస్తాబవుతోంది. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలతో చెరువులో నీరు నిండుతోంది. దీంతో మినీ ట్యాంక్ బండ్, లేక్ వ్యూ పార్క్‌లో సందడి మొదలవుతోంది. దీంతో చెరువు కట్ట వెంట ఏపుగా ఎదిగిన పిచ్చిచెట్లను తొలగిస్తున్నారు. అలాగే, కట్ట చుట్టూ కంచె నిర్మించి ఈత కొలను సైతం సిద్ధం చేస్తున్నారు. గత ఏడాది రూ.1.62 కోట్లతో మినీ ట్యాంక్‌బండ్ నిర్మించగా, రూ.1.75 కోట్ల వ్యయంతో లేక్ వ్యూ పార్క్ రూపొందించారు. ఇప్పుడు చెరువు నీటితో నిండే నాటికి అవసరమైన మరమ్మతులు చేసి కొత్త అందం తీసుకురానున్నారు.

120 ఏళ్ల కిందట..

ప్రస్తుతం ఇల్లెందు జలాశయంగా పిలిచే ఇల్లెందులపాడు చెరువు సర్వే నంబర్ 182/1, 182/2లో విస్తరించి ఉంది. అయితే, చెరువు శిఖం భూమిని చుట్టుపక్కల వారు ఆక్రమించారు. అధికారులు శిఖం భూమిని గుర్తించి పూర్తిస్థాయిలో పూడిక తీస్తే చెరువు ఏడాది పొడవునా నీటితో కళకళలాడుతుంది. బ్రిటీష్ వారు ఇల్లెందులో బొగ్గు నిక్షేపాలు కనుగొన్న కాలంలో సుమారు 120 ఏళ్ల కిందట ఇల్లెందు ప్రజల దాహార్తి తీర్చేందుకు ఇల్లెందులపాడులో జలాశయం ఏర్పాటు చేశారు. ఈ చెరువులో 15 ఫీట్ల మేర నీరు నిల్వ ఉంటుంది. చెరువులోని రెండు గుమ్మసాల ద్వారా ఫిల్టర్‌బెడ్‌కు, అక్కడి నుంచి పట్టణ ప్రజలకు సరఫరా చేస్తున్నారు. రెండేళ్లుగా చెరువులో వేసవిలోనూ నీరు నిల్వ ఉంటుండగా, అలుగు పడినప్పుడు ఆహ్లాదంగా మారుతోంది.

మినీ ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి

ఇల్లెందు చెరువును రూ.1.62 కోట్లతో మినీ ట్యాంక్ బండ్‌గా తీర్చిదిద్దారు. ఈ నిధులతో అలుగు మరమ్మతులు, చుట్టూ కంచె ఏర్పాటు చేయడమే కాక కట్ట ఎత్తు, వెడల్పు పెంచే పనులు చేపట్టారు. బతుకమ్మ ఘాట్ పనులు పూర్తి చేశారు. ఇక కట్ట కింది భాగాన పార్క్ అభివృద్ధి చేసి మీద లైటింగ్, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు.


కట్టపై పనులు చేస్తున్న పొక్లెయినర్

వేగంగా పనులు పూర్తి చేయాలి..



వర్షాలు పెరుగుతున్నందున పనులు వేగంగా పూర్తి చేయాలి. చెరువు కట్టపై అల్లుకుపోయిన అన్ని చెట్లు తొలగించి వాహనాలు నడిచేలా గ్రావెల్ పోయాలి. లైట్లన్నీ వెలిగేలా పర్యవేక్షించడంతో పాటు కట్టపై బల్లాలు వేయించాలి. బోటింగ్ కూడా ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

–కటకం పద్మావతి, 2వ వార్డు కౌన్సిలర్

త్వరలోనే కొత్తకళ



చెరువు కట్టపై చెట్ల తొలగింపు, ఇతర పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దడంతో ప్రజలు సేద తీరేందుకు ఉపయోగంగా ఉంటుంది. చెరువు అలుగు పడితే ఇక్కడకు వచ్చే వారి సంఖ్య పెరిగి కొత్త కళ సంతరించుకుంటుంది.

–డి.వెంకటేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్

రాయల చంద్రశేఖర్ ఆదర్శప్రాయుడు


మాట్లాడుతున్న నాయిని రాజు

ఇల్లెందురూరల్/ఇల్లెందు: మాస్‌లైన్ నేత రాయల చంద్రశేఖర్ జీవితం విప్లవకారులకు ఆదర్శనీయమని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకులు నాయిని రాజు, అజ్మీర బిచ్చా అన్నారు. మండలంలోని కొమరారం గ్రామంలో సోమవారం రాయల చంద్రశేఖర్ సంతాప సభ నిర్వహించగా వారు మాట్లాడారు. విప్లవ వారసత్వ కుటుంబంలో జన్మించిన రాయల చంద్రశేఖర్ చిరుప్రాయం నుంచే విప్లవ భావాలను పునికిపుచ్చుకున్నారని, యాభై ఏళ్లపాటు విప్లవోద్యమ నిర్మాణానికి కృషి చేశాడని తెలిపారు. సమావేశంలో బుర్రా రాఘవులు, వాంకుడోత్ శంకర్, సమ్మయ్య, జాన్‌బాబు, శాంతారావు, ముత్తమ్మ, పాషా తదితరులు పాల్గొన్నారు. అలాగే, పట్టణంలోని మున్సిపల్ కార్మికుల అడ్డాలో ఏర్పాటు చేసిన రాయల చంద్రశేఖర్ సంతాపసభలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పట్టణ కార్యదర్శి యాకూబ్‌షావలి మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే పీడిత ప్రజల కోసం, వ్యవస్థలో మార్పు కోసం పని చేశారని తెలిపారు. కార్యక్రమంలో దుర్గం మహేశ్, కాశబోయిన సదా, సంజు, నందు, ప్రకాష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ ప్రాంత ఎస్సీలపై వివక్ష

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్రంలో ఏజెన్సీ ప్రాంతం పేరుతో ఎస్సీ కులాలపై వివక్ష చూపుతున్నాయని షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మెర శ్రీనివాస్ ఆరోపించారు. సోమవారం కొత్తగూడెంలోని సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాకాల అసెంబ్లీ సమావేశాల్లో ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాల అభివృద్ధిపై ప్రస్తావించి న్యాయం చేయాలని కోరారు. అభివృద్ధి, అధికారంలో వాటా కోల్పోయిన ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాలను గుర్తించాలని, పది జిల్లాలు, 96 మండలాల్లోని 15 లక్షలకుపైగా జనాభా ఉన్న ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాల పక్షాన ఒక్క ప్రజాప్రతినిధి కూడా లేడని వెల్లడించారు.


మాట్లాడుతున్న బొమ్మెర శ్రీనివాస్

సమావేశంలో ఎనగంటి కృపాకర్, కండె రాములు, నాగేశ్వరరావు, రమణయ్య, తిరుమల్‌రావు, పార్వతి, బోడ ముత్తయ్య, సమ్మయ్య పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేసేవారికే గుర్తింపు


బదిలీ ఉద్యోగులను సన్మానిస్తున్న కమిషనర్ స్వామి

పాల్వంచ: అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు గుర్తింపు అదే వస్తుందని మున్సిపల్ కమిషనర్ ఎ.స్వామి అన్నారు. మున్సిపాలిటీ కార్యాలయంలో పనిచేసే జూనియర్ అసిస్టెంట్లు విజయలక్ష్మి, రాజేశ్వరి ఇల్లెందుకు, నర్మద మణుగూరుకు, రామ్మూర్తి కొత్తగూడెంనకు, మేనేజర్ రవిప్రసాద్ రావు కొత్తగూడెంనకు, అకౌంటెంట్ సతీశ్ ఖమ్మంకు, బిల్ కలెక్టర్‌లు సారయ్య ఇల్లెందు, వంశీ, సునీల్‌లు కొత్తగూడెం మున్సిపాలిటీలకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సోమవారం కార్యాలయ సమావేశం మందిరంలో వారికి సన్మానం చేశారు. కార్యక్రమంలో డీఈ మురళి, ఏఈ రాజేశ్, టీపీఓ సత్యనారాయణ, ఎస్‌ఐ లక్ష్మణ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యకు అధిక నిధులు కేటాయించాలి

జూలూరుపాడు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2024–2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రవేశపెట్టే బడ్జెట్‌లో విద్యకు అధిక శాతం నిధులు కేటాయించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దేశంలో, రాష్ట్రంలోనూ ప్రభుత్వ విద్య పరిరక్షణ, బలోపేతం చేసే విధంగా నిధులు కేటాయించాలని, రాష్ట్రంలో ప్రతి జిల్లాకు ఒక నవోదయ కేంద్రీయ విద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

సింగరేణి(కొత్తగూడెం): విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని టౌన్ ఎస్‌ఐ సెల్వరాజ్, ఏఎస్‌ఐ ఎస్తేర్‌రాణి అన్నారు. చుంచుపల్లి మండలంలోని ధన్‌బాద్‌లోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్లో సోమవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించగా వారు హాజరయ్యారు. విద్యార్థులకు గ్రీన్, రెడ్, బ్లూ, ఎల్లో బ్యాడ్జిలు అందించి, వారిచే ప్రతిజ్ఞ చేయించారు. బ్రదర్ రాజశేఖర్‌రెడ్డి, జార్జిరెడ్డి, అభిలాష్ పాల్గొన్నారు.


బ్యాడ్జ్ అందిస్తున్న ఎస్‌ఐ, ఏఎస్‌ఐ

పార్టీ శ్రేణులు భాగస్వాములు కావాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): భారీ వర్షాలు, వరదలతో గోదావరి పరివాహక ప్రాంతాలతో పాటు జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు పార్టీ శ్రేణులు సహాయ సహకారాలు అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. గోదావరి రెండో ప్రమాద హెచ్చరిక దాటి ఉధృతంగా ప్రవహిస్తోందని, ఇప్పటికే చాలా ఏజెన్సీ గ్రామాలు వరదలో చిక్కుకోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వారికి అండగా నిలవాలని పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జూలూరుపాడు: రైతుబీమా పథకం కోసం అర్హులైన రైతులందరూ దరఖాస్తు చేసుకోవాలని ఏఓ రఘుదీపిక కోరారు. సోమవారం ఆమె జూలూరుపాడులో మాట్లాడుతూ.. 18 నుంచి 59 ఏళ్ల వయస్సు ఉన్న రైతులు ఈ నెల 30వ తేదీ వరకు రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవచ్చని, నామినీ చనిపోతే భార్య, భర్త పేర్లు కాకుండా ఇతర సంబంధీకుల పేర్లు ఇచ్చి పేర్లు మార్పు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వివరాలకు 93920 21147, 77801 28743, 95739 55521, 93814 61608 నంబర్లలో సంప్రదించాలని ఏఓ కోరారు.

అక్రమాలపై విచారణ ఏది?

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ ఎందుకు జరిపించడం లేదని అఖిలపక్షం నాయకులు ప్రశ్నించారు. సోమవారం కొత్తగూడెంక్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రశ్నకు ప్రశ్న సమాధానం కాదని, నాలుగున్నరేళ్ల అవినీతిపై సమగ్ర విచారణకు స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలని కోరారు. పలు టెండర్లలో అవినీతి జరిగిందని ఆరోపణలు వస్తుంటే స్థానిక ఎమ్మెల్యే ఎందుకు నోరు మెదపడం లేదని, ప్రశ్నించేవారి గొంతు నొక్కి, బెదిరింపులతో అణచివేయాలనుకోవడం వారి అవివేకమన్నారు. సమావేశంలో పలు పార్టీల నాయకులు జేబీ శౌరి, ఎర్రా కామేశ్, జలాల్, సాధిక్ పాషా, మోరే భాస్కర్, వీణ, మోదుగు జోగారావు తదితరులు పాల్గొన్నారు.

గుంతలను పూడ్చాలి..

సింగరేణి(కొత్తగూడెం): మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు వద్ద వర్షాలు పడి గుంతలు ఏర్పడ్డాయని, వీటిని వెంటనే పూడ్చాలని వార్డు కౌన్సిలర్ కంచర్ల జమలయ్య కోరారు. సోమవారం జాతీయ రహదారి 14వ నంబర్ వద్ద గుంతలను ఆయన కంకర, మట్టితో ఆటో డ్రైవర్ల సహకారంతో పూడ్చారు. సంబంధిత అధికారులు స్పందించి గుంతలను పూడ్చి వాహనదారుల ఇబ్బందులను తొలగించాలని కోరారు.

మృతులకు నివాళులు

ఇల్లెందు: మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో చీకుర్తి ప్రభాకర్, 22వ వార్డులో మాతంగి నర్సయ్య సోమవారం మృతి చెందగా మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, మాజీ వైస్ చైర్మన్ మడత వెంకట్‌గౌడ్ నివాళులర్పించారు. వారి వెంట నవీన్, రవీందర్, నాగలక్ష్మి, భాగ్యమ్మ, యాకుబ్‌షావలి, ఇమామ్, శ్రీనివాస్, మేకల శ్యామ్, ధనలక్ష్మి, కిరణ్, ఆదూరి రవి ఉన్నారు.

జూలూరుపాడుకు 'సీతారామ' జలాలు


జూలూరుపాడు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్


టేకులపల్లి: వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జూలూరుపాడు: సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ ద్వారా తరలించే గోదావరి జలాలను జూలూరుపాడు మండలంలోని చెరువుల్లోనూ నింపి సాగు భూములకు సరఫరా చేస్తామని, ఈ విషయంలో రైతులు అపోహలు విడనాడాలని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ సూచించారు. జూలూరుపాడులో సోమవారం ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌ను వివిధ గ్రామాల రైతులు కలవగా ఆయన మాట్లాడారు. రైతుల వినతి మేరకు మండలంలోని ప్రతీ చెరువును సీతారామ జలాలతో నింపి సాగు అవసరాలకు ఇచ్చేలా కృషి చేస్తానన్నారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా ఏన్కూరు లింక్ కెనాల్ ద్వారా వైరా రిజర్వాయర్ వరకు నీటిని తీసుకెళ్లడం వల్ల జూలూరుపాడు మండలానికి అన్యాయం జరుగుతోందనే అంశం అపోహ అని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్‌నాయక్, ప్రజాప్రతినిధులు, నాయకులు దుద్దుకూరి మధుసూదన్‌రావు, రోకటి సురేశ్, యల్లంకి చిన్ననాగేశ్వరరావు, నర్వనేని పుల్లారావు, గుగులోత్ హరిసన్, ధర్మరాజుల వెంకటనారాయణ, పాపిన్ని జనార్దన్, బానోత్ నవీన్, గుగులోత్ మోహన్, పణితి జగన్నాథం పాల్గొన్నారు. అలాగే, అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని కోరుతూ భేతాళపాడు పంచాయతీకి చెందిన రైతులు ఎమ్మెల్యేను కొత్తగూడెంలో కలిసి వినతి పత్రం అందజేశారు. మాజీ సర్పంచ్ గుగులోత్ రాందాస్, రైతులు చౌడం లక్ష్మీనారాయణ, చలమల గోవింద్, పోగుల నాగభూషణం, బొద్దు మల్లికార్జున్, గోపు రామకృష్ణ, చౌడం రాములు, చలమల నరసింహారావు, ధరావత్ కిషన్ పాల్గొన్నారు.

ఏజెన్సీ మండలాలకు ఇవ్వాలి

టేకులపల్లి: అశ్వాపురం మండలం కుమ్మరిగూడెం వద్ద నిర్మిస్తున్న సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను జిల్లాలోని ఏజెన్సీ మండలాల భూములకు అందించడంతో పాటు రోళ్లపాడు చెరువును రిజర్వాయర్‌గా మార్చాలని న్యూడెమోక్రసీ నాయకులు డి.ప్రసాద్, భూక్యా హరోజ్య, సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్ డిమాండ్ చేశారు. సోమవారం టేకులపల్లి తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చాక వారు మాట్లాడారు. తొలుత జిల్లాలోని ఏడు లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చేలా ప్రాజెక్టును డిజైన్ చేయగా ఇప్పుడు మారిన ప్లాన్‌తో జిల్లాకు చుక్క నీరు అందే పరిస్థితి లేదన్నారు. ఇకనైనా ప్రజాప్రతినిధులు స్పందించి మైదాన ప్రాంతానికి కాకుండా తొలుత ఏజెన్సీ మండలాల రైతులకు సాగునీరు అందించాలని, టేకులపల్లి మండలం రోళ్లపాడు చెరువుతో పాటు బయ్యారం చెరువును రిజర్వాయర్‌గా మార్చాలని డిమాండ్ చేశారు. నాయకులు కల్తీ వెంకటేశ్వర్లు, ఎట్టి నరసింహారావు, గుగులోతు రామచంద్ర, నర్సింగ్, వెంకట్రావు, బీక్లా, నోముల భానుచందర్ పాల్గొన్నారు.

గురువయ్య సేవలు మరువలేనివి..


గురువయ్యను సన్మానిస్తున్న జీఎం శాలేంరాజు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికుల రక్షణ చర్యలతో పాటు వారి ఆరోగ్య పరిరక్షణ కోసం కృషి చేసిన జీఎం (రక్షణ విభాగం) గురువయ్య సేవలు మరువలేనివని కొత్తగూడెం ఏరియా జీఎం శాలేంరాజు కొనియాడారు. ఈ నెల 31న ఉద్యోగ విరమణ చేయనున్న గురువయ్యను కొత్తగూడెంలోని జీఎం కార్యాలయంలో సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా షాలేంరాజు మాట్లాడుతూ ప్రతీ ఉద్యోగి ఆరోగ్య వివరాలు సేకరించి వైద్యపరీక్షలు చేయించడంతో పాటు అందరూ హెల్మెట్ ధరించేలా గురువయ్య కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు రమేశ్, ఎన్.యోహాన్, శివకేశవరావు, ఎం.వెంకటేశ్వరరావు, బి.మాధవ్, శేషశ్రీ, కరీముల్లా, శ్రీరామచంద్ర, మురళి, ఎం.శ్రావణ్‌కుమార్, మజ్జి మురళి, సంఘమిత్ర తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

టేకులపల్లి: మండలంలోని ముత్యాలంపాడు క్రాస్ రోడ్డులోని రైతువేదికలో సోమవారం ఎమ్మెల్యే కోరం కనకయ్య లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆడపడుచుల కళ్లలో ఆనందం చూసేందుకే కల్యాణలక్ష్మి పథకానికి ఎలాంటి ఆటంకం లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టిందని తెలిపారు. అర్హులకు తప్పనిసరిగా పథకం వర్తిస్తుందని, మధ్యవర్తులను ఆశ్రయించకుండా నేరుగా అధికారులను కలిసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బాణోతు ప్రియాంక, నాగభవాని, లక్కినేని సురేందర్, ఉండేటి ప్రసాద్, బాణోతు సరోజిని, కోరం సురేందర్, భూక్య దేవానాయక్, రాసమల్ల నర్సయ్య, రత్తయ్య, వెంకటేశ్వర్లు, శ్వేత, కన్నయ్య, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.


చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

లాభాల వాటా చెల్లించండి..

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ ఈ ఏడాది ఆర్జించిన లాభాల్లో కార్మికులకు 35 శాతం వాటా చెల్లించాలని ఏఐటీయూసీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. కొత్తగూడెంలోని యూనియన్ కార్యాలయంలో సోమవారం వారు మాట్లాడుతూ.. సింగరేణిలో రాజకీయ జోక్యం ఉండొద్దని టీబీజీకేఎస్‌ను ఓడించి ఏఐటీయూసీకి పట్టం కట్టినా పరిస్థితిలో మార్పు రాలేదన్నారు. కాగా, సింగరేణి యాజమాన్యం కార్మికులను రిఫరల్‌కు పంపిస్తుంటే అక్కడ ఉద్యోగుల తీరుతో చిన్నచిన్న చికిత్సకు సైతం రూ.లక్షల్లో రికవరీ చేస్తున్నారని తెలిపారు. డిపెండెంట్ ఉద్యోగుల వయో పరిమితిని 35 నుంచి 40 ఏళ్లకు పెంచి నెలన్నర దాటినా అధికారుల్లో చలనం లేదన్నారు. కాగా, కొత్తగూడెం ఏరియా పరిధి పీవీకే-5 ఇంక్‌లైన్‌ను సందర్శించిన సీతారామయ్య, నాయకులు.. అక్కడి కార్మికుల సమస్యలను తెలుసుకున్నారు. సమస్యలను పరిష్కరించాలని గని మేనేజర్ అనిల్‌సాగర్‌ను కోరారు. గనిగెల వీరస్వామి, రమణమూర్తి, జక్కుల గట్టయ్య, కె.రాములు, క్రిస్టోఫర్, సముద్రాల శ్రీను, సుధాకర్, రాము, సందెబోయిన శ్రీనివాస్, సావటి స్వామి, గట్టయ్య, నాగేశ్వరరావు, సుధాకర్, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

మురుగునీటిలోనే నిర్వహణ



మండలంలోని గోలియాతండా పంచాయతీ వాగొడ్డుతండా అంగన్‌వాడీ కేంద్రం మురుగునీటి దుర్వాసన నడుమ కొనసాగుతోంది. ఐదేళ్లలోపు చిన్నారులు, బాలింతలు, గర్భిణులు వచ్చి పోయే ఈ కేంద్రంలోకి వెళ్లాలంటే బురద, మురుగునీటి నిల్వలను దాటి వెళ్లాల్సి వస్తోంది. ఆవరణలో ఉన్న మిషన్ భగీరథ ట్యాంకు నిండినప్పుడు వృథాగా పోయే నీరు, వర్షం పడినప్పుడు వరద నీరు అంతా కలిపి అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో నిలిచి, ముగురుగా మారి, దోమలు, ఇతర కీటకాలకు ఆశ్రయంగా మారుతోంది. మట్టి పోసి వరద నీరు నిల్వ లేకుండా చేయాలని, ప్రహరీ నిర్మించాలని కొన్నేళ్లుగా పాలకులకు, అధికారులకు స్థానికులు, తల్లిదండ్రులు పదేపదే చెబుతున్నా పట్టించుకున్నవారే లేరని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కనీసం బ్లీచింగ్ పౌడర్ చల్లించిన దాఖలాలు కూడా లేవని తెలుస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

–టేకులపల్లి